క్లుప్తంగా

పోలీసుల తనిఖీ



వాజేడు : మండలంలోని ప్రగళ్లపల్లి గ్రామం వద్ద భద్రాచలం–వాజేడు రహదారిపై ఎస్సై కొప్పుల తిరుపతిరావు ఆధ్వర్యంలో సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహన చోదకులను, ప్రయాణికులను, లగేజీని క్షుణ్ణంగా సోదా చేశారు. ప్రయాణికుల గుర్తింపు కార్డులను పరిశీలించారు. రాకపోకలపై ఆరాతీశారు.

కంకలవాగులో మృతదేహం లభ్యం



పోతురాజు (ఫైల్)

వెంకటాపురం (కె) : మండల కేంద్రంలోని కంకలవాగులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గంగినబోయిన పోతురాజు (55) ఈనెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పోతురాజు కోసం తెలిసిన వాళ్ల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా గురువారం ఉదయం చొక్కాల గ్రామ సమీపంలోని కంకల వాగులో వ్యక్తి మృతదేహం ఉందని అటుగా వెళ్లిన కూలీలు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోతురాజు కుటుంబీకులకు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. పోతురాజు మద్యం మత్తులో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెంది ఉంటాడని పేర్కొంటూ అతడి కొడుకు నర్సింహారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు జాబితా విడుదల

మంగపేట : మండలంలోని ఓటర్ల తుది జాబితాను తహసీల్దార్ శ్రీనివాసులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో 34 వేల 772 మంది ఓటర్లుగా నమోదు అయ్యారని తెలిపారు. ఓటరు లిస్టు ప్రకారం 17 వేల 462 మంది పురుషులు, 17 వేల 309 మంది స్త్రీలు, ఇతరులు ఒకరు నమోదైనట్టు చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్, జూలై, అక్టోబర్ 1 తేదీల నాటికి 18 ఏళ్లు నిండనున్న అందరికీ భారత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటు హక్కు కల్పించినట్లు వివరించారు. మండలంలోని ఓటర్లు తమ పేరు, ఇతర వివరాల కోసం బూత్ లెవల్ అధికారుల వద్ద ఉన్న లిస్టును చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సంతోష్



భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్‌హౌజ్‌లో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ మంత్రి సత్యావతిరాథోడ్‌ను సేవాలాల్ సేనా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ సంతోష్ నాయక్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎస్సైని కలిసిన నాయకులు



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన రెండవ ఎస్సై ప్రశాంత్‌ను పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి సన్మానం చేశారు. ఎస్సైని కలిసిన వారిలో అంబాల శ్రీనివాస్, పృథ్వీ, మహేందర్, రంజిత్, హఫీజ్, కిరణ్ ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

టేకుమట్ల(రేగొండ): వ్యక్తి అదృశ్యమైన సంఘటన రేగొండ మండలంలోని భాగిర్థిపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భాగిర్థిపేటకు చెందిన పసుల కిషన్(30) నవంబర్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోవడంతో కిషన్ తండ్రి చేరాలు గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కిషన్ ఆచూకీ తెలిసిన వ్యక్తులు పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

మొగుళ్లపల్లి: మండలంలోని వేములపల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ గురువారం తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్, యాజమానులైన పరకాల మండలం వరికోల్ గ్రామానికి చెందిన కరుణాకర్, యుగేందర్, కేశెట్టి రాజేష్ పై కేసు నమోదు చేశారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ఎస్‌ఎస్ తాడ్వాయి : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని తాడ్వాయి పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్ గౌడ్ కోరారు. ఆ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని కాటాపూర్, దామరవాయి, బీరెల్లి, కామారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లోనే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. దళారులకు ధాన్యం విక్రయించొద్దని సూచించారు. దళారులకు విక్రయిస్తే ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన టెంట్, తాగునీటి, టార్పాలిన్ షీట్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ సంపత్ గౌడ్, ఇతరులు

ధాన్యం కొనుగోలు కోసం వచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు యానాల సిద్దిరెడ్డి, రమేశ్, నాయకులు మేడిశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

‘భద్రాచలం’లో గెలుపే లక్ష్యం

వెంకటాపురం (కె) : రానున్న ఎన్నికల్లో భద్రాచలంలో నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి శ్రేణులు పని చేయాలని బీజేపీ నియోజకవర్గ పాలక్ సీతయ్య కోరారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు అట్లూరి రఘురామ్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా సీతయ్య హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ చొరవ వల్లే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. బీజేపీ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పార్టీని విస్తరింపజేయడానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగరేయడం ఖాయమని జోస్యం చెప్పారు. అనంతరం సీతయ్యను



సమావేశంలో మాట్లాడుతున్న సీతయ్య

పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర కన్వీనర్ కుంజా సత్యవతి, భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్ గోలకొటి శ్రీనాథరావు, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు, ఎంపీపీ చెరుకూరి సతీశ్‌కుమార్, నాయకులు తంగెళ్లపల్లి ప్రసాద్, జల్లిగంపల లక్ష్మిపతి, ఉప్పల కృష్ణమూర్తి, బట్టా శేఖర్, నవీన్, అంకాల దుర్గ, సరిత రమేశ్, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తా



ములుగు : సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని స్థానిక జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా గురువారం తనను కలవడానికి వచ్చిన ఎంపీడీఓలతో ఆయన మాట్లాడారు. మండలాల అభివృద్ధికి పాటుపడతానని భరోసా ఇచ్చారు. పంచాయతీ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా చొరవ తీసుకుంటానని చెప్పారు. అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తొలుత ఎంపీడీఓల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ఇక్బాల్, శ్రీనివాస్, ప్రవీణ్, సత్య ఆంజనేయ ప్రసాద్, ఫణిచంద్ర, శ్రీధర్ పాల్గొన్నారు.

సమాఖ్య భవనం మంజూరు చేయాలి

వెంకటాపురం (ఎం) : మండలంలోని వెంకటాపూర్, నల్లగుంట, రామానుజాపూర్ గ్రామాల మహిళా సంఘాల సమావేశాల నిర్వహణ కోసం సమాఖ్య భవనాన్ని మంజూరు చేయాలని ఆయా గ్రామాల గ్రామ సంఘాల అధ్యక్షులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు ఎంపీపీ బుర్ర రజిత, గై రుద్రమదేవితో కలిసి జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. మూడు గ్రామాలకు చెందిన గ్రామ సంఘాల సమావేశాల నిర్వహణ కోసం భవనం లేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సంఘాల అధ్యక్షులు తోట మాధవి, ఎండి హసీనా, మునిగంటి విజయ, దేశిని జీవిత, ముప్పు నిరోశ, వీఓలు శెట్టి మంజుల, యాకూబి, తైనవేని సరోజన, శెట్టి రాజు, మోత్కూరి సరళ, మంతెన రమాదేవి, బల్ల నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

చిట్యాల: దివ్యాంగుల హక్కుల మండల కమిటీని గురువారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నైన్‌పాక గ్రామానికి చెందిన గూట్ల ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ఉపాధ్యక్షులుగా ఓదెలు, దశరథం, ప్రధాన కార్యదర్శిగా బండారి రవీందర్, సహాయ కార్యదర్శులుగా చెన్నమల్ల చంద్రమౌళి, బండి అనిల్ కుమార్, సోషల్ మీడియా కార్యదర్శిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా పంచిక శ్రీను, రవి, కోశాధికారిగా తుమ్మ రజిత, కార్యవర్గ సభ్యులుగా శోభ, లింగయ్య, భద్రయ్య, చక్రపాణి, సాంబయ్యలను ఎన్నుకున్నారు.

సేవాలాల్ సేన కార్యవర్గం..

మల్హర్: సేవాలాల్ సేన మండల కార్యవర్గాన్ని సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్ భూక్యా సురేష్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూక్యా రవినాయక్, ఉపాధ్యక్షుడిగా లాకవత్ తిరుపతినాయక్, ప్రధాన కార్యదర్శిగా దారవత్ సవేందర్‌నాయక్, మహిళ అధ్యక్షురాలిగా లావుడియ రోజమ్మ, మండల యువసేన అధ్యక్షుడిగా భూక్యా నరేష్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా రాజునాయక్, రైతు సేన మండల అధ్యక్షుడిగా లాకవత్ రవినాయక్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు బాలునాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధుకర్ నాయక్, జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి జాడి కీర్తిబాయి, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

మహదేవపూర్: ఎమ్మార్పీఎస్ సంఘంపై వాట్సాప్ గ్రూపులో అనుచిత వ్యాఖ్య చేశారనే ఫిర్యాదుతో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీధర్ అనే వ్యక్తి ఇటీవల వాట్సాప్ గ్రూపులో ఎమ్మార్పీఎస్ సంఘంపై అనుచితంగా వ్యాఖ్యలు చేశారని పలువురు నాయకులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో సదురు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

జాతీయ సమావేశానికి తరలిరావాలి

ఏటూరునాగారం : ఈనెల 11న బెంగుళూరులో తలపెట్టిన ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పుల్లూరి కరుణాకర్ కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా అన్ని అనుబంధ సంఘాల శ్రేణులు రావాలని సూచించారు. ప్రస్తుత సమావేశాల్లోనే పార్లమెంటులో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్

లేనిపక్షంలో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సతీశ్, వాసంపెల్లి చైతన్య, మబ్బు నవీన్, వావిలాల భిక్షపతి, నేగారకంటి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

మల్హర్ : విద్యార్థులు సైబర్ నేరాలుపై అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని కొయ్యూర్ ఏఎస్సై కుమారస్వామి అన్నారు. మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, షీ టీమ్స్‌పై విద్యార్థులకు ఏఎస్సై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులల్లో సెల్ ఫోన్ వినియోగం తప్పనిసరి అయిందని తెలిపారు. యువత సెల్ వినియోగంపై జాగ్రత్తగా ఉండాలని, ఫోన్‌కు వచ్చే లింకులు పూర్తిగా తెలుసుకున్న తర్వాతే ఓపెన్ చేయాలని సూచించారు. బాలికలు అపరిచిత వ్యక్తులతో లేదా ఒంటరిగా ఉన్నప్పుడు



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై కుమారస్వామి

వారిపై అనుమానం వచ్చినప్పుడు కానీ ఏమైనా ప్రమాదం జరిగినప్పుడు షీ టీంను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీలు రమేష్, సౌజన్య, రోజా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

మల్హర్: మండలంలోని వల్లెకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీఓ విక్రమ్‌కుమార్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, కేంద్రానికి వస్తున్న పిల్లల సంఖ్యపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పాలు, గుడ్లు, పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీపీ విక్రమ్

క్రీడా ప్రాంగణానికి స్థలం ఎంపిక

మల్హర్: మండలంలోని అడ్వాలపల్లి గ్రామ పంచాయతీలో క్రీడా ప్రాంగణానికి స్థలాన్ని ఎంపిక చేసినట్లు తహసీల్దార్ జివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ నర్సింహామూర్తి తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ ఆధ్వర్యంలో క్రీడా స్థలాన్ని గురువారం పరిశీలించారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సరిత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అంగన్‌వాడీ టీచర్ నియామకం

మహదేవపూర్: మండలంలోని కుదురుపల్లి గ్రామానికి అంగన్‌వాడీ టీచర్‌గా నిర్మలను నియమిస్తూ కలెక్టర్ భవేశ్‌మిశ్రా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఏడాది క్రితం అంగన్‌వాడీ టీచర్ నోటిఫికేషన్ విడుదల కాగా స్థానికత విషయమై కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో నియామకం నిలిచిగా ఆమె హైకోర్టును ఆశ్రయించింది. దీంతో కలెక్టర్ నియమిస్తూ ఆర్డర్ కాపీ అందించారు.

నేడు నిరసన దీక్ష

మొగుళ్లపల్లి : ఇళ్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వమే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నేడు(శుక్రవారం) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు నిరసన దీక్ష చేయనున్నట్లు మండల అధ్యక్షుడు కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు.

‘ప్రొటోకాల్ తెలియదా ’

కాళేశ్వరం: కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అధికారులకు ప్రొటోకాల్ తెలియదా అని సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులు లక్ష తులసి పూజా కార్యక్రమానికి ఆహ్వానించి తమను అవమానపర్చారని పేర్కొన్నారు. కనీస స్థానిక సర్పంచ్‌గా ప్రొటోకాల్ పాటించకుండా పక్కనే ఉన్న అధికారులు, సిబ్బంది మౌనం పాటించారని పేర్కొన్నారు. ఈ విషయమై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల స్వీకరణ

మహదేవపూర్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టు పోస్టును భర్తీ చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ రహత్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులు పొంది ఉండాలని, ఎస్సీ ఎస్టీలు 50 శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈనెల 7లోగా దరఖాస్తు చేయాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన బోధన

ఏటూరునాగారం : ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్యాబోధన లభిస్తుందని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవద్గీత తెలిపారు. కళాశాలలో ప్రవేశాల కోసం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌ను, ఆశ్రమ పాఠశాలను గురువారం డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రిన్సిపాల్ భగవద్గీత మాట్లాడారు. జెడ్పీ, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకోవాలని సూచించారు. ఇంటర్‌లో చేరాల్సిన కోర్సులు, భవిష్యత్ గురించి పదో తరగతిలోనే తెలుసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు అవగాహన కల్పించేలా డ్రైవ్ చేపట్టినట్టు తెలిపారు. ఏ కోర్సు చదివితే ఏయే ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయన్న విషయమై చైతన్యవంతం కావాలన్నారు. తద్వారా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు



విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భగవద్గీత

సాగాలని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పిస్తున్నట్టు వివరించారు. వాటిని వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు పవన్‌రాజ్, వెంకటేశ్వర్లు, వెంకటేశ్, రాజ్‌కుమార్, ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యాధికారికి ఘనసన్మానం

మంగపేట : మండలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిగా విధుల్లో చేరిన డాక్టర్ నిఖిల్‌కుమార్‌ను సిబ్బంది గురువారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. తొలుత ఆయనకు ఏఎన్‌ఎంలు, సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వైద్యాధికారి నిఖిల్‌కుమార్ మాట్లాడారు. తాను గతంలో ఇక్కడే ఎపిడమిక్ టీం వైద్యాధికారిగా, మంగపేట పీహెచ్‌సీలో ఇంచార్జి వైద్యాధికారిగా పని చేసినట్టు గుర్తు చేశారు. వనదేవతలు సమ్మక్క–సారలమ్మ, మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి కృపతో ఇదే మండలంలో వైద్యాధికారిగా ప్రజలకు సేవలు అందించే భాగ్యం కలిగిందన్నారు. సిబ్బంది, ఏఎన్‌ఎంలు సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించే దిశగా సహకరించాలని కోరారు. సిబ్బందికి,



వైద్యాధికారి నిఖిల్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్టు స్వర్ణలత, స్టాఫ్ నర్స్ మౌనిక, ల్యాబ్ టెక్నీషియన్ రాంబాబు, హెల్త్ ఎడ్యూకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం అరుణ, సోమలక్ష్మి, సీతారావమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ

ఎస్‌ఎస్ తాడ్వాయి : మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) డైరీని ఆ సంఘం మండల అధ్యక్షుడు చల్లూరి రమేశ్‌బాబు ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ సాంబయ్య, నోడల్ అధికారి రేగ కేశవరావు గురువారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. సంఘం 70 వసంతాలు పూర్తి చేసుకుందని చెప్పారు. విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కుల సాధనే లక్ష్యంగా సంఘం పని చేస్తోందని తెలిపారు. నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు నూతన సంవత్సరంలో మరింత ప్రణాళికాయుతంగా పని చేసి సంఘాన్ని, విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి సతీశ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్తయ్య, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు వీరభద్రం, నాయకులు వెంకన్న, నరేందర్, రాజు, రాజయ్య, సరిత, హనుమంతు, అబ్దుల్ రహీం తదితరులు పాల్గొన్నారు.



డైరీని అవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ ఎంఈఓ సాంబయ్య, నోడల్ అధికారి కేశవరావు

స్వరాజ్య స్థాపనకు పోరాడాలి

ఏటూరునాగారం : స్వరాజ్య స్థాపనకై బీసీ, ఎస్టీ, ఎస్సీ వర్గాలు పోరాడాలని దళిత శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ కోరారు. పది వేల కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా గురువారం రాత్రి ఏటూరునాగారం మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా డీఎస్పీ జెండా, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌక్ నిర్వహించిన సభలో విశారదన్ మహరాజ్ మాట్లాడారు. ములుగు, ఏటూరునాగారం, భద్రాచలం లాంటి గిరిజన అటవీ ప్రాంతాల్లోనూ అగ్రకుల పాలనే సాగుతుందని చెప్పారు. సమ్మక్క, సారలమ్మ స్ఫూర్తితో బడుగులు రాజకీయ యుద్ధం చేయాలని సూచించారు. అణగారిన వర్గాలు అధికారంలోకి వచ్చిన వెంటనే మేడారం కేంద్రంగా ప్రజాసంక్షేమ రాజ్యాన్ని నిర్మించవచ్చని తెలిపారు. 125 అడుగుల సమ్మక్క సారలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేసుకుందామన్నారు. రూ.10 వేల కోట్ల వ్యయంతో మేడారాన్ని అభివృద్ధి చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న విశారదన్

కార్యక్రమంలో పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్ మహరాజ్, డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జెరిపోతుల కరుణాకర్, చరణ్, ఉపాధ్యక్షులు సాగర్, గణపతి, రాజు, తరుణ్, మండల అధ్యక్షుడు రాజశేఖర్, మీడియా ఇన్‌చార్జ్ తరుణ్, స్థానిక నాయకులు గద్దం మహేశ్, రఘు, సప్పిడి రాంనర్సయ్య, ముక్కెర లాలయ్య, హనుమంత్, తాళ్లపెల్లి నర్సింహులు, సురేశ్, సాంబశివరావు పాల్గొన్నారు.

సన్మానం



తిరుపతిని సన్మానిస్తున్న ఎంపీ వెంకటేశ్ నేత

పలిమెల: ఇటీవల అంతర్జాతీయ ధమ్మదుత్ బ్రాండ్ అంబాసీడర్ అవార్డు వరించిన మండల కేంద్రానికి చెందిన జవ్వాజి తిరుపతిని పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత గురువారం సన్మానించారు. భీం సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై, సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు పాత్ర పోషించిన జవ్వాజి తిరుపతికి అంతర్జాతీయ ధమ్మదుత్ బ్రాండ్ అంబాసిడర్ అవార్డు వరించింది. ఈ మేరకు క్యాంపు కార్యాలయంలో ఎంపీ వెంకటేశ్ నేత జవ్వాజి తిరుపతిని శాలువాతో సత్కరించి సన్మానించారు. అనంతరం ఎంపీ వెంకటేశ్ నేత మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.

భూములపై హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న ఓదెలు

చిట్యాల: దళితులకు పంపిణీ చేసిన భూములకు అన్ని హక్కులు కల్పించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఓదెలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1978, 79 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అసైన్మెంట్ లావని పట్టాలు దళితులకు ఎస్సీ, ఎస్టీలకు సీలింగ్ యాక్ట్ కింద భూపంపిణీ చేసిందని అన్నారు. ఆ భూములను ఎస్సీ, ఎస్టీలు ఇప్పటివరకు దున్నుకుంటూ పంటలు పండించుకుంటున్నారన్నారు. భూములకు అసైన్మెంట్ లావని పట్టా అని పట్టేదారు పాసుపుస్తకాలు ఇచ్చారన్నారు. ఈ పట్టా గల భూములకు ప్రభుత్వ బ్యాంకులలో రుణాలు ఇవ్వడం లేదని తెలిపారు.

జిల్లాస్థాయి టీఎల్‌ఎం మేళాకు ఎంపిక

కాటారం: జిల్లా స్థాయిలో నిర్వహించనున్న టీచింగ్ లర్నింగ్ మెటీరియల్ కార్యక్రమానికి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ నెల 3న మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాలో మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్ట్‌ల వారిగా స్వయంగా రూపొందించిన టీఎల్‌ఎం మెటీరియల్స్‌ను మేళాలో ప్రదర్శించారు. దీంతో అధికారులు మండలంలోని పలు పాఠశాలలను జిల్లా స్థాయి మేళాకు ఎంపిక చేశారు. తెలుగు విభాగంలో ఆదివారంపేట, మద్దులపల్లి, చిద్నెపల్లి, కాటారం, విలాసాగర్, గణితం విభాగంలో చిద్నెపల్లి, ఆదివారంపేట, చింతకాని, విలాసాగర్, కాటారం, ఇంగ్లీష్ విభాగంలో దామెరకుంట(ఎస్సీ), దేవరాంపల్లి, చిద్నెపల్లి, దస్తగిరిపల్లి, మద్దులపల్లి, ఈవీఎస్ విభాగంలో కొత్తపల్లి, ఆదివారంపేట, అల్లీపూర్, సుందరాజ్‌పేట, మర్రిపల్లి పాఠశాలలు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు.